క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఐదు పోలింగ్ కేంద్రాలు


రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి

సామర్లకోట: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాజకీయ నాయకులు ప్రతిపాదించారు. పోలింగ్ కేంద్రాల విషయమై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గతంలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఒకటి, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పెరుగుతున్న ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని బచ్చు ఫౌండేషన్ హైస్కూల్‌లో మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగినీడి భవన్నారాయణ సూచించారు. దానిని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తొటకూర శ్రీనివాసు, బీజేపీ అధ్యక్షుడు కామిరెడ్డి ఏడుకొండలు అంగీకరించారు. దాంతో మండల పరిధిలో ఐదు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు.

పట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలి


లీఫ్ రోలర్ పురుగు ఆశించిన మల్బరీ ఆకులు

పిఠాపురం: మల్బరీ తోటలను లీఫ్ రోలర్ పురుగు ఆశించిందని, పట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి గీతారాణి సూచించారు. ఈ పురుగు పంటలో లేత ఆకులను తినేసి తోట పెరగకుండా చేస్తుందన్నారు. దీని నివారణకు ఇంటర్పెడ్ మందు లీటర్ నీటికి 1.5 ఎంఎల్, ఎకరాకు 200 లీటర్ల ద్రావణంలో, 100 గ్రాముల సర్ఫ్ పొడి కలిపి ఉదయం పూట పిచికారీ చేయాలని ఆమె సూచించారు. మందు కొట్టిన 15 రోజుల వరకూ పురుగులకు మల్బరీ ఆకు వాడరాదన్నారు. వేప నూనె రెండు ఎంఎల్, సర్ఫ్ పొడి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వేప ద్రావణం వాడిన ఆకులను 8–9 రోజుల వరకు పురుగులకు వాడరాదని సూచించారు.

పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ


కుక్కుటేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న పండితులు

పిఠాపురం: పవిత్ర కార్తికమాసాన్ని పురస్కరించుకుని పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కుక్కుటేశ్వరస్వామి వారికి పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు లక్షపత్రి పూజలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫుట్‌బోర్డుపై కనిపిస్తే కఠిన చర్యలు

- ఖాళీగా ఉన్న బస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- యువతకు క్రైమ్ సీఐ కౌన్సెలింగ్


సామర్లకోటలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న క్రైమ్ సీఐ అంకబాబు

సామర్లకోట: ఖాళీగా ఉన్న బస్సులను ఎక్కడానికి యువత ప్రయత్నించాలని క్రైమ్ సీఐ అంకబాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బస్సు కాంప్లెక్స్‌లో యువతకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకులు అందరూ ఒకే బస్సు ఎక్కడానికి ప్రయత్నించడం వల్ల పలు సార్లు దుర్ఘటనలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. బస్సు ఎక్కి ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణించడం నేరమని హెచ్చరించారు. ఇలా వేలాడుతూ ప్రయాణిస్తున్న గమనిస్తే వెంటనే బస్సులను నిలిపి విద్యార్థులను దింపేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ గంగిరెడ్డి బలరామ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దోమ కాటు.. పాడికి చేటు

- పాడి పశువుల్లో తగ్గుతున్న పాల దిగుబడి
- ఆందోళన చెందుతున్న రైతులు
- మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పెద్దాపురం: దోమ చిన్నదే.. పశువులను అది కుట్టినా నష్టం లేదులే అని అశ్రద్ధ చేస్తే పాడి రైతులు పెద్ద మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోంది. దోమ కాటు పాడికి చేటు తెస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ మురుగు గుంతలు, పశువులశాలల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రదేశాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో మూగ జీవాలకు దోమల బెడద ఎక్కువైంది. దోమల నుంచి పశువులను సంరక్షించుకుంటే వాటి ఆరోగ్యంతో పాటు పాల దిగుబడి ఆశాజనకంగా ఉంటోంది. లేకపోతే పశువుల ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాడితో జీవనోపాధి

నియోజకవర్గంలో పాడి రైతులు ఎక్కువగా ఉన్నారు. గ్రామాల్లో అనేక మంది రైతులు ఒకటి, రెండు పాడి గేదెలను మేపుతూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దోమల ఉధృతి తగ్గిపోయి పాల దిగుబడి తగ్గిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమలతో మూగజీవాలకు వచ్చే సమస్యలు

- పశువులను దోమలు కుట్టడం వల్ల పాల దిగుబడి తగ్గుతుంది.
- మేత సరిగా తీసుకోలేవు.
- ఆకలి మందగిస్తుంది.
- మేత తినక పశువులు బలహీనంగా తయారవుతాయి.
- జ్వరం బారిన పడతాయి.
- పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోతుంది.
- చర్మంపై దురద, దద్దుర్లు, పుండ్లు ఏర్పడతాయి.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పశువులశాలలు, పాకలు శుభ్రంగా ఉంచాలి.
- సాధ్యమైనంత వరకూ పశువులు కట్టే ప్రదేశం సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేసుకోవాలి.
- ఎప్పటికప్పుడు పశువుల మూత్రం, పేడ తొలగించుకోవాలి.
- గుంతల్లో వ్యర్థాలు, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- ప్రధానంగా పశువుల షెడ్లు, పాకల్లో దోమలు చొరబడకుండా దోమ తెరలు వాడాలి.
- పశువుల పాక చుట్టూ గుబురుగా ఉండే పొదలు తొలగించాలి.
- పశువులు తినగా వదిలేసిన మేతను నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- సాయంత్రం పాకల్లో వేప ఆకుల పొగపెట్టాలి.

నియోజకవర్గంలో ఆవులు, గేదెల వివరాలు


మండలం	ఆవులు	గేదెలు	మొత్తం
పెద్దాపురం	5136	25858	30994
సామర్లకోట	2397	14893	17290

జాగ్రత్తలు పాటించాలి



పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల వల్ల పశువులకు అనారోగ్యం కలగకుండా, పాడికి నష్టం లేకుండా రైతులు చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పశువుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తూ రక్షించుకోవాలి. వాటి శరీర ఉష్ణోగ్రత పెరిగినా, మేత తినకుండా నలతగా ఉన్నా ఏదో అనారోగ్యం బారిన పడిందని గ్రహించి, వెంటనే పశు వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ రాకేష్‌కుమార్, పశువైద్యాధికారి, ఆర్‌బీ పట్నం, పెద్దాపురం మండలం


దోమకాటుకు గురైన గేదె

పాదగయను దర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ


ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి మోహన్‌కు ఆలయ విశిష్టతను వివరిస్తున్న అర్చకులు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రాన్ని శనివారం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి మోహన్ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. క్షేత్రంలోని గణపతి, స్వయంభూ దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా అమ్మవార్లకు ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన సహాయ కమిషనర్, ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ సమక్షంలో వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

మరుగుదొడ్ల ఏర్పాటు

కార్తిక మాసం సందర్భంగా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రోత్సాహంతో పీకే ట్రస్టు మంగళగిరి సహాయంతో 20 మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. 10 మహిళలకు మరో 10 పురుషులకు ఏర్పాటు చేశామన్నారు. ఈ మరుగుదొడ్లను శనివారం నుంచి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన తెలిపారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి


సదస్సులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతుల భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ అవగాహన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలో శనివారం వీకే రాయపురం పంచాయతీలో నిర్వహించిన రీ సర్వే అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. రైతుల దస్తావేజుల లోను, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన యథార్థ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతు ఈ రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని రైతుల భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామ సభల్లో సాయంత్రం వరకు 32 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గొర్సలో రీ సర్వే గ్రామ సభ

కొత్తపల్లి: మండలంలోని గొర్స గ్రామ సచివాలయం వద్ద శనివారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. భూముల రీ సర్వేలో నెలకొన్న సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ గ్రామ సభకు 35 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీటీ సరోవ, గ్రామా రెవెన్యూ అధికారి జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భీమేశ్వరుని గ్రామోత్సవం


సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్వాలా తోరణం వద్ద భక్తుల సందడి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరుని గ్రామోత్సవం శనివారం మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. కార్తిక కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్ప వాహనాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, చెరుకూరి రాంబాబు పూజలు చేశారు. ఆలయ అధికారులు ఈశ్వరరావు, భద్రరావుల పర్యవేక్షణలతో భక్త సంఘ సభ్యులు ఆర్వీ సుబ్బరాజు, ప్రసాద్ గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి గోదావరి కాలువ వంతెన, ఫ్లైఓవర్, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్న వీధి, యార్లగడ్డవారి వీధి, మఠంసెంటర్, అయోధ్య రామ పురం, కొత్తూరు, స్టేషన్‌సెంటర్‌మీదుగా తిరిగి గ్రామోత్సవం ఆలయంకు చేరింది. ఇళ్ల వద్దకు వచ్చిన ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు, బ్యాండ్ మేళం ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా జ్వాలా తోరణం

గ్రామోత్సవం అనంతరం శనివారం రాత్రి జ్వాలాతోరణం నిర్వహించారు. స్వామివారి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చిన సమయంలో రెండు కర్రలకు ఎండు గడ్డి తాళ్ల మధ్య మూడు కొబ్బరికాయలను ఉంచి ఆ గడ్డి తాళ్లకు నిప్పు పెట్టారు. పల్లకిని మూడు పర్యాయాలు హరహర మహాదేవ శంభో శంకర అంటూ తిప్పారు. ఈ సమయంలో కొబ్బరి బొండాను తెంచుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. కొబ్బరి బొండాలు లభించిన భక్తులు అదృష్టవంతులనే నమ్మకం ఉండడంతో బొండాల కోసం పోటీ పడ్డారు. జ్వాలా తోరణంలో నిప్పు అంటుకున్న గడ్డి తీసుకొవడం ద్వారా మంచి జరుగుతుందనే నమ్మకంతో గడ్డిని తీసుకోడానికి సైతం భక్తులు పోటీ పడ్డారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈఓ బళ్ల నీలకంఠం, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, భక్త సంఘం సభ్యులు భక్తులకు సేవలందించారు. కాగ ఈ నెల 19న స్వామి వారి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా రాత్రి ఆలయ కోనేరులో తెప్పోత్సవం ఉంటుందని ఈఓ తెలిపారు. జ్వాలా తోరణం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా సీఐ ఎ.కృష్ణభగవాన్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన


క్షేత్రంలో సాగుతున్న గ్రామోత్సవం

ఆలయంలో రూ.2,500 చెల్లించి లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. వారు కొన్ని దీపాలు వెలిగించగా మిగిలిన దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు. ఆలయంలో ధ్వజస్తంభం వద్ద శనివారం రాత్రి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పూజలు చేసి ఆకాశ దీపాన్ని ప్రారంభించారు.

సహకార స్ఫూర్తితో ముందడుగు

కాకినాడ: సహకార ఉద్యమ స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా స్థానిక కేసీబీఎస్ ఆవరణలో శనివారం సాయంత్రం ఉపాధి కల్పన–నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస్ సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీవో మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న ఎన్నో సంస్థలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. డీసీసీబీ సీఈఓ ఆర్వీ నరసింహారావు మాట్లాడుతూ సహకార వ్యవస్థ ద్వారా మెరుగైన ఉపాధి కల్పనతో పాటు నైపుణ్యాభివృద్ధి సాధన దిశగా ఆయా సహకార సంస్థలు మరింత శ్రమించాలన్నారు. డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ బీకే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సహకార రంగం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న తమ సంస్థ విజయవంతంగా నడుస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించగలుగుతుందన్నారు. కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న తమ సంస్థ ఇటీవల వందేళ్లు పూర్తి చేసుకుని శతజయంతి ఉత్సవాలను కూడా నిర్వహించుకుందన్నారు. సమావేశాన్ని డీసీవో వెంకటకృష్ణ ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కేసీబీఎస్ మహిళా ఉద్యోగులు సహకార గీతాన్ని ఆలపించారు. నైపుణ్యాభివృద్ధిని సాధించడంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై రామదాసు సహకార శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కేసీబీఎస్ మేనేజర్ చీమలకొండ గంగాధరం అతిథులకు స్వాగతం పలికారు. సమావేశంలో డీసీసీబీ జీఎం పి.ప్రవీణ్ కుమార్, వారోత్సవాల ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, కేసీబీఎస్ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు చెకుముకి సైన్స్ సంబరాలు

సామర్లకోట: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగానికి సంబంధించి మండల పరిధిలోని ఉండూరు, ప్రకాశరావు పేటలోని ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు.

శబరిమలకు అయ్యప్పభక్తులు


కొండెవరం నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప మాలధారులు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం నుంచి అయ్యప్ప మాలధారులు శనివారం ఇరుముడలతో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. తొలుత కొండెవరం వేంకటేశ్వర స్వామి, పాటిమిద రామాలయం, కృష్ణుడు ఆలయాల్లో సుమారు 108 మంది స్వాములు ఇరుముడి కట్టుకున్నారు. పలు గ్రామలకు చెందిన స్వాములు శరణు ఘోష చెప్పుకుంటూ శబరిమలకు పయనమయ్యారు.

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయిస్తాం


వాకతిప్పలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెత్త వేయరాదని, చెత్త వేసేందుకు స్థలం కేటాయిస్తామని జిల్లా పంచాయతి అధికారి పి.రవికుమార్ అన్నారు. మండలంలోని వాకతిప్ప ఎండీపేట సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వం స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ పేషెంట్ల బ్లాక్ శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వచ్చారన్నారు. స్థానికులు పీహెచ్‌సీ వద్ద చెత్త సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారని, దీనిపై స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డుకు స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలని దొరబాబు, ఎండీవో రవికుమార్, తహసీల్దార్ చిన్నారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాసాల మధ్య వ్యర్థాలు వేయవద్దంటూ ర్యాలీ

కొత్తపల్లి: ప్రజలు నివాస ఉండే ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేయాలనే ఆలోచనను అధికారులు మానుకోవాలని సీపీఎం నాయకుడు గుర్రాల అప్పారెడ్డి అన్నారు. మండలంలోని వాకతిప్ప ఎండీపేట సమీపంలో చెత్తను డంపింగ్ చేసేందుకు అధికారులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఇది తెలుసుకున్న స్థానికులు సీపీఎం ఆధ్వర్యంలో ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో ర్యాలీ చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఎంపీడీవో రవికుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంగర సుబ్రహ్మణ్యం, వాసు, చంద్రబాబు, నాగమణి, కుమారి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు


గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న శివకృష్ణ తదితరులు


ఉప్పాడ గ్రంథాలయంలో ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం


సామర్లకోట గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సామర్లకోట: గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా మూడో రోజు విద్యార్థులు వ్యాసరచన పోటీ లకు ఉత్సాహంగా హజరయ్యారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశారు. జూనియర్ విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకత, సీనియర్ విద్యార్థులకు సెల్ ఫోన్ అతి వినియోగం వల్ల ఎదురయ్యే దుష్ఫలితాలపై వ్యాస రచన పోటీలను గ్రంథాలయాధికారి బందిల రత్నమణి ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు ఉపాధ్యాయులు తులసి రాంబాబు, టీవీ సత్యనారాయణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం దాత ఎంఎస్ఆర్ వెంకటరమణ ఆధ్యాత్మిక పుస్తకాలను అందజేశారని గ్రంథాలయాధికారి తెలిపారు. ఆదివారం చిత్రలేఖన పోటీల్లో జూనియర్ విద్యార్థులు గ్రామీణ వాతావరణం, సీనియర్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై పోటీలు ఉంటాయన్నారు. సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఉంటాయని తెలిపారు. దీనిలో జూనియర్ విద్యార్థులకు గ్రంథాలయం ఒక దేవాలయం అనే అంశంపై, సీనియర్ విభాగంలోని విద్యార్థులకు చదవటం మా కిష్టం అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. 6, 7 తరగతి విద్యార్థులను జూనియర్లుగాను, 8, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్ విదార్థులను పరిగణించడం జరుగుతుందని చెప్పారు. చిత్రలేఖనం పోటీలకు విద్యార్థులు డ్రాయింగ్ షీట్లు, రంగులు విద్యార్థులే తీసుకురావాలన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని 20వ తేదీన ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందని రత్నమణి వివరించారు.

సామాజిక చైతన్యానికి దోహదం

పెద్దాపురం: ప్రతి వ్యక్తికి విజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యానికి గ్రంథాలయాలు దోహదపడతతాయని పెద్దాపురం చారిత్రక పరిశోధకులు వంగలపూడి శివకృష్ణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ, చిత్రపటాల ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నేడు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నామంటే ఆనాటి గ్రంథాలయోద్యమ కారుల ఆశయాల ఫలమేనన్నారు. ప్రతి వ్యక్తిలో సామాజిక చైతన్యం, విజ్ఞానం పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోసుల కృష్ణబాబు, గ్రంథాలయ సిబ్బంది ఎస్.బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం లైబ్రేరియన్ నళీనీప్రియ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ఉద్యమకారుల చిత్రాపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఉద్యమకారులు చేసిన కృషిని వివరించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

104 సిబ్బంది ఆందోళన

పిఠాపురం: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 104 సిబ్బంది శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు పిఠాపురం మండలం జల్లూరు సర్పంచ్ గుత్తుల మాధవి నూకరాజుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ కల్పించాలని, ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావలసిన ఇతర బకాయిలు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, పిఠాపురం 104 సిబ్బంది రాఘవ, సంతోష్, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ర్యాలీ నిర్వహించిన రైతుల కూలీ సంఘ నాయకులు

సామర్లకోట: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమ్మాణమ్మ అపార్టుమెంటును రైతు కూలీ సంఘ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ఇళ్లు లేని అనేక మంది నిరుపేదలు అమ్మాణమ్మ అపార్టుమెంటులో అద్దెలకు ఉంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి అర్హులను గుర్తించి ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా అమరవీరులను నివాళులు అర్పించారు. ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాకుల రామలింగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు కడితి సతీష్, జిల్లా నాయకులు తదితరులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.